సాక్షి
సంగారెడ్డి

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



శివాజీ జీవితం భావితరాలకు స్ఫూర్తి

సంగారెడ్డిటౌన్: ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం భావితరాలకు స్ఫూర్తి దాయకమని వక్తలు పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. హిందూ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం శివాజీ చౌక్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సాయిబాబా దేవాలయ కమాన్, చౌరస్తా నుంచి పట్టణ పురవీధుల గుండా బైక్ ర్యాలీ చేశారు.

న్యూస్‌రీల్

కార్తీక్‌కు కలెక్టర్ అభినందన

జేఈఈ మెయిన్స్‌లో 99.17 పర్సంటైల్ సాధించిన కార్తీక్



కార్తీక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి: ఇటీవల జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.17 పర్సంటైల్ సాధించి ప్రతిభ కనబరిచిన సంగారెడ్డి పట్టణానికి చెందిన విద్యార్థి పి.కార్తీక్‌ను బుధవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...విద్యార్థులు జీవితంలో లక్ష్యం పెట్టుకుని ఇష్టంతో చదివితే మంచి విజయాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇష్ట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికిరణ్‌రెడ్డి, అకాడమిక్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ

డీఎల్‌పీవో అనిత



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో అనిత

హత్నూర(సంగారెడ్డి): గ్రామాలలో తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీవో అనిత సూచించారు. హత్నూర మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శులతో డీఎల్‌పీవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ...గ్రామాలలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలున్నా వెంటనే మరమ్మతులు చేయించాలని, ప్రతీరోజు పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. గుండ్లమాచునూరు గ్రామంలోని నర్సరీని ఆమె పరిశీలించారు. గ్రామపంచాయతీ రికార్డులను సైతం పరిశీలించి కార్యదర్శికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఈవో యూసుఫ్, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేతకీ హుండీ ఆదాయం రూ.28లక్షలు



కేతకీలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఝరాసంగం(జహీరాబాద్): శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయం 76 రోజుల హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, మహామంగళ హారతి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం హైదరాబాద్‌లోని శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు ఆదాయాన్ని లెక్కించారు. ఈ మేరకు రూ.28,07,500ల ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ ఈవో శివరుద్రప్ప, ఆలయాధికారులు, అర్చకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజానుకూల బడ్జెట్‌గా మార్పులు చేయాలి




బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌ను ప్రజానుకూల బడ్జెట్‌గా మార్పు చేయాలని సీపీఎం జిల్లా నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ...కేంద్ర బడ్జెట్ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, కేవలం కార్పొరేట్ శక్తులకు మేలు కలిగించే బడ్జెట్ అని విమర్శించారు. ప్రధాని మోదీ రైతు బడ్జెట్ అంటూనే రైతు రుణమాఫీకి తగిన బడ్జెట్ కేటాయించలేదన్నారు. విద్యుత్ సంస్కరణలతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కుదేలవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీసం వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాయిలు, మాణిక్యం,నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

జీడీడీపీలో దూకుడు!

తలసరి ఆదాయంలో జిల్లా రాష్ట్ర సగటు కంటే అధికం

- జిల్లా స్థూల వార్షిక ఉత్పత్తి రూ.60,298 కోట్లు
- హైదరాబాద్ జిల్లాలు మినహాయిస్తే రాష్ట్రంలోనే తొలిస్థానం
- పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధే కారణం
- తెలంగాణ గణాంక శాఖ–2024 నివేదికలో వెల్లడి



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఒక దేశం..ఒక రాష్ట్రం అభివృద్ధిని సూచించేది తలసరి ఆదాయం (జీడీపీ). ఒక ఆర్థిక ఏడాదిలో ఆ దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవలు..ఇలా అన్ని రంగాల్లో జరిగిన వస్తూత్పత్తి విలువను జీడీపీ (గ్రాస్ డొమెస్టిక్ ప్రోడక్ట్)గా లెక్కిస్తారు. జీడీడీపీ(గ్రాస్ డొమెస్టిక్ డిస్ట్రిక్ట్ ప్రోడక్ట్)లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలను మినహాయిస్తే...సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2022–23 ఆర్థిక ఏడాదిలో జిల్లాలో జరిగిన వస్తూత్పత్తి విలువ ఏకంగా రూ.60,298 కోట్లుగా ప్రభుత్వం లెక్కతేల్చింది. రాష్ట్ర జీడీపీ రూ.13.11 లక్షల కోట్లుకాగా, జిల్లా జీడీడీపీ రూ.60,298 కోట్లు ఉంది. ఇది మొత్తం జీడీపీలో సుమారు ఐదు శాతంగా తేల్చింది. తెలంగాణ రాష్ట్ర గణాంకశాఖ నివేదిక–2024ను ప్రభుత్వం రెండు రోజుల క్రితం ప్రకటించింది. ఈ నివేదికలో జీడీడీపీ అంశాన్ని ముఖ్యంగా ప్రస్తావించింది.

పారిశ్రామిక ఉత్పత్తి...

సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. జిల్లాలో ఓడీఎఫ్, బీడీఎల్ రక్షణ రంగానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ఎంఆర్‌ఎఫ్, మహేంద్ర అండ్ మహేంద్ర వంటి ఆటోమొబైల్ భారీ పరిశ్రమలు కూడా జిల్లాలోనే ఉన్నాయి. మరోవైపు రాష్ట్రంలోనే అత్యధిక ఫార్మా పరిశ్రమలున్న జిల్లా కూడా సంగారెడ్డినే. బల్క్‌డ్రగ్, కెమికల్ పరిశ్రమలు కూడా వందల్లో ఉంటాయి. వీటిలో ఏటా రూ.వేల కోట్ల విలువ చేసే వస్తూత్పత్తి జరుగుతుంది. జిల్లాలో ఉన్న ఫార్మా పరిశ్రమల్లో జరిగిన ఉత్పత్తి విదేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతుంది. ఇలా ఎగుమతుల విలువ రూ.వేల కోట్లు ఉంటుంది. దీంతో జీడీడీపీలో సంగారెడ్డి జిల్లా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో పోటీ పడుతోంది.

తలసరి ఆదాయంలో మేడ్చల్‌ను వెనక్కినెట్టి...

వ్యక్తి తలసరి ఆదాయం (పర్ క్యాపిటా ఇన్‌కం)లో విషయంలో సంగారెడ్డి జిల్లా మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాను వెనక్కినెట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పోటీ పడుతోంది. రాష్ట్రంలోనే మూడోస్థానంలో నిలిచింది. జిల్లాలో ఒక వ్యక్తి తలసరి ఆదాయం ఏడాదికి రూ.3.21 లక్షలుగా తేల్చింది. మొదటిస్థానంలో రంగారెడ్డి జిల్లా రూ.9.54లక్షలు కాగా, హైదరాబాద్ జిల్లా 4.97 లక్షలు. జిల్లా తలసరి ఆదాయం రాష్ట్ర సగటు తలసరి ఆదాయం కంటే అధికంగా ఉండటం గమనార్హం. తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.11లక్షల కోట్లు కాగా, జిల్లాలో తల సరి ఆదాయం అంతకంటే ఎక్కువగానే ఉంది.

వ్యవసాయ ఉత్పత్తి సైతం...

కేవలం పారిశ్రామికంగానే కాకుండా సంగారెడ్డి జిల్లా ఇటు వ్యవసాయరంగంలోనూ ముందువరుసలో ఉంటుంది. ప్రధానంగా పత్తి, చెరుకు వంటి వాణిజ్య పంటలతోపాటు, పసుపు, అల్లం వంటి సుగంధద్రవ్యాల పంటలు కూడా అధికంగా పండుతున్నాయి. వరి సాగు కూడా జిల్లాలో ఉంటుంది. ఇలా ఈ పంటల దిగుబడులు కూడా అధికంగా ఉండటంతో జీడీడీపీ విషయంలో సంగారెడ్డి హైదరాబాద్ జిల్లాలతో పోటీ పడుతోంది.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మహిళా డిగ్రీ కళాశాల 'విపణి' కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి



విద్యార్థులు తయారు చేసిన పానీపూరి తింటున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుంచి మార్కెటింగ్ అవకాశాలపై శిక్షణ ఇవ్వడం ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవసరమైన శిక్షణలను అందించడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతారన్నారు. మహిళా డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విపణిని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన వంటకాలను కలెక్టర్ రుచి చూశారు. హ్యాండీక్రాఫ్ట్ స్టాళ్లను పరిశీలించారు.

వంద శాతం పన్ను వసూలు చేయాలి

అధికారుల సమీక్షలో కలెక్టర్

సంగారెడ్డి జోన్: జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో 100శాతం పన్నులు వసూలు లక్ష్యంగా మున్సిపల్ అధికారులు పని చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పన్ను వసూళ్లకు ఆర్డీవోలు, ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, బిల్ కలెక్టర్లకు సహకరించాలన్నారు. పన్ను చెల్లిస్తే ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించాలని, జిల్లాలోని పరిశ్రమలలో కూడా పనులు వసూలు చేయాలని సూచించారు. జిల్లాలో పన్నుల బకాయిలు ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. వేసవికాలంలో మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా అవసరమైన అన్ని మరమ్మతు చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలలో అదనపు అంతస్తుల కళాశాల భవనాల, పరిశ్రమల నిర్మాణం కోసం దరఖాస్తులను పరిశీలించి వెంటనే పన్నులు వసూలు చేసి అనుమతులు మంజూరు చేయాలని చెప్పారు. మున్సిపాలిటీల పరిధిలో ఉన్న పార్కుల్లో పచ్చదనం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. మిషన్ భగీరథ కనెక్షన్లు తాగునీటి పైపులు లైన్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. సమీక్షలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ప్రజా వైద్యారోగ్య అధికారి ప్రతాప్, జిల్లా ఉన్నతాధికారులు, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

వోక్స్‌వ్యాగన్ వర్సిటీ ప్రొఫెసర్ ఆత్మహత్య

- 18 నెలలుగా ఇక్కడ విధులు
- మృతుడు జార్ఖండ్ వాసి



సుమంత్ కుమార్

మునిపల్లి(అందోల్): కంకోల్ వోక్స్‌వ్యాగన్ యూనివర్సిటీలో ఆర్ట్ అండ్ డిజైనర్ విభాగంలో అధ్యాపకుడు ప్రొఫెసర్ సుమంత్ కుమార్(36) వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సుమంత్ కుమార్ 18 నెలలుగా మునిపల్లిలోనే ఉంటూ వర్సిటీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయనతో పాటు మరో వ్యక్తి కలసి ఒకే గదిలో ఉంటున్నారు. ప్రతీరోజు ఉదయం 9 గంటలకు వర్సిటీలో తరగతులకు హాజరుకావాల్సిన సుమంత్ మధ్యాహ్నం 12 గంటలైనా డిపార్ట్‌మెంట్‌కు రాకపోవడంతో సిబ్బంది ఆయన రూమ్ వద్దకు వెళ్లి తలుపులు తెరిచి చూడగా అప్పటికే ఆయన ఫ్యాన్‌కు వేలాడుతూ నిర్జీవంగా కన్పించారు. దీంతో వర్సిటీ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన అక్కడకు చేరుకుని ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని కిందికి దించి పంచనామా నిమిత్తం సదాశివపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జార్ఖండ్‌లో ఉంటున్న సుమంత్ తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం అందించారు. కాగా, సుమంత్‌తో పాటు ఉండే మరో వ్యక్తి ఆదివారం ఊరికి వెళ్లగా అప్పట్నుంచి ఆయన ఒక్కరే గదిలో ఉంటున్నారు. కాగా, బుధవారం ఉదయం వర్సిటీలో సమీపంలోని ఓ దేవాలయానికి వెళ్లి వచ్చినట్లు వర్సిటీ సిబ్బంది చెబుతున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసులు అన్నికోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు.

డంప్‌యార్డ్‌పై అర్ధనగ్న ప్రదర్శన

గుమ్మడిదలలో 15వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలు 15వ రోజుకు చేరుకున్నాయి. ఒక్కోరోజు ఒక్కో వినూత్న రీతిలో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం అర్ధనగ్నంగా జేఏసీ నాయకులు ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. మరోవైపు మహిళలు వందల సంఖ్యలో పాల్గొని ప్రధాన కూడళ్ల వద్ద ర్యాలీలు నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేశారు. ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటు విరమించే వరకు ఆందోళన కార్యక్రమాలు విరమించేది లేదని స్పష్టం చేశారు.

అపార్ కష్టాలు

- విద్యార్థుల నమోదులో ఆధార్‌కార్డు వివరాలు సరిపోలని వైనం
- నేటికీ సగం కూడా పూర్తికాని పరిస్థితి
- అపార్ నమోదు నిరంతర ప్రక్రియ అంటున్న అధికారులు



అపార్‌పై నిర్వహిస్తున్న వర్క్ షాపులో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు (ఫైల్)

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు ప్రక్రియకు అనేక రకాలుగా అవాంతరాలు ఎదురవుతున్నాయి. చాలామంది విద్యార్థులకు సంబంధించిన వ్యక్తిగత వివరాలకు ఆధార్‌లో సమాచారం సరిపోకపోవడంతో అపార్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలలో 1 నుంచి 12వ తరగతుల వరకు విద్యాభ్యాసం చేసే పిల్లలకు వీటిని జారీ చేసేలా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఏ తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయి? విద్యాభ్యాసం ఎక్కడ జరిగింది వంటి వివరాలు పొందుపర్చనున్నారు. ప్రతీ కార్డులో 12 అంకెల విశిష్ట సంఖ్య ఉంటుంది.

50శాతం కూడా నమోదు కాని వైనం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, గురుకుల,మహాత్మజ్యోతిరావు బాపూలే. ఆదర్శ పాఠశాలలు 1,344 కాగా 1,32,371 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలు 21 ఉండగా వీటిలో 6,918, ప్రైవేట్ పాఠశాలలు 507లో 2,07,809 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా, ప్రైవేట్ కళాశాలలో 15,155 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలలో 69,207 మంది, ప్రభుత్వ కళాశాలలో 789, ప్రైవేట్ పాఠశాలలో 1,23,256 కాగా ప్రైవేట్ కళాశాలలో 2,789 మంది విద్యార్థులకు సంబంధించిన వివరాలను మాత్రమే అపార్‌లో నమోదు చేశారు.

అవాంతరాలు ఎన్నో...

నమోదు ప్రక్రియను జనవరి 31లోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ గడువు పూర్తి అయినప్పటికీ నమోదు అంతంత మాత్రమే ఉండటంతో మరోసారి గడువు పొడిగించారు. అపార్ నమోదుపై ఉపాధ్యాయులకు అవగాహన సదస్సును నిర్వహించి, తప్పనిసరిగా విద్యార్థి వివరాలను అపార్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులకు అప్పగించారు. విద్యార్థులకు కేటాయించిన యూ డైస్ పోర్టల్‌లో వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది. లాగిన్ అయిన తర్వాత విద్యాలయంలోని రిజిష్టర్‌లో ఉన్న వివరాలు, పిల్లలు తీసుకువచ్చిన ఆధార్‌కార్డుతో పోల్చి చూడాలి. ఈ క్రమంలో చాలామంది విద్యార్థుల ఆధార్ కార్డులో పుట్టిన తేదీ, ఇంటి పేరు, చిరునామాలు సరిగ్గా లేకపోవడం, అక్షరదోషాల కారణంగా అపార్‌లో నమోదు ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారుతోంది. సంక్రాంతి సెలవులు రావడంతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమైంది.

వర్క్‌షాప్ నిర్వహిస్తున్నాం

విద్యార్థి వివరాలను అపార్‌లో నమోదు చేయాల్సి ఉంది. అపార్ నమోదు నిరంతర ప్రక్రియ. దీనిపై ఇప్పటికే ఉపాధ్యాయులకు వర్క్‌షాప్ ఏర్పాటు చేశాం. త్వరలో విద్యార్థుల వివరాలను అపార్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

మార్చిలో మహిళా సంఘాలకు ఎన్నికలు!

- ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ
- మే నుంచి సంఘాలకు కొత్త అధ్యక్షులు
- అధ్యక్షుల పదవీ కాలం పొడిగింపు



మహిళా సంఘం సభ్యులు

సంగారెడ్డి జోన్: మార్చిలో మహిళా సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రక్రియను మరింత వేగవంతం చేయనున్నారు. మార్చి నెలాఖరులోగా ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. మహిళా స్వయం సంఘాల బలోపేతానికి సంఘాల సభ్యులతో పాటు అధ్యక్షుల పాత్ర కీలకం. జిల్లాలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మహిళా సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాలకు కొత్త అధ్యక్షులను త్వరలో ఎన్నుకోనున్నారు. ఎన్నికల నిర్వహించేందుకు ఇప్పటికే మండల స్థాయిలోని ఏపీఎంతో పాటు సీసీలకు శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. మహిళా సంఘాల సభ్యులకు ఎన్నిక నిర్వహణపై అవగాహన కల్పించనున్నారు.

మూడు పద్ధతులలో ఎన్నిక

మహిళా స్వయం సహాయక సంఘాల ఎన్నిక ప్రక్రియ మూడు పద్ధతులలో ఎన్నుకోనున్నారు. నిబంధనల మేరకు రిజర్వేషన్ ప్రకారం ఏకగ్రీవం, చేతులు పైకి ఎత్తి, చీటీలు రాసి ప్రక్రియలో ఏదైనా ఒక ప్రక్రియలో ఎన్నుకుంటారు. ప్రతీ గ్రామంలో ఉన్న సంఘాల ద్వారా ఎన్నికైన అధ్యక్షులు గ్రామ సమాఖ్య అధ్యక్షురాలును ఎన్నుకుంటారు. ఎన్నికైన గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు అందరూ కలిసి మండల సమాఖ్య అధ్యక్షురాలుని, మండల సమాఖ్య అధ్యక్షురాలు కలిసి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిని ఎన్నుకుంటారు. మే నుంచి సంఘాలకు కొత్త అధ్యక్షులు కొనసాగనున్నారు.

సభ్యుల సంఖ్య కుదింపు

గతంలో కంటే అధ్యక్షుల పదవీ కాలాన్ని పొడిగించినట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామైక్య సంఘం అధ్యక్షురాలి పదవీ కాలం ఐదేళ్లకు, మండల, జిల్లా సమాఖ్యలను మూడేళ్ల పాటు నిర్ణయించారు. అదే విధంగా గతంలో కంటే ప్రస్తుతం కమిటీలో సభ్యుల సంఖ్యను తగ్గించారు. మండల, జిల్లా సమాఖ్య సంఘానికి అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారితో కమిటీని ఎన్నుకోవాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

సంఘాల బలోపేతం దిశగా..

గ్రామాలలోని స్వయం సహాయక సంఘాల బలోపేతంతో పాటు సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అధ్యక్షులు కీలక పాత్ర పోషించనున్నారు. తమ పరిధిలో ఉన్న సభ్యులకు రుణాలు అందించటం, వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించటంతో పాటు తిరిగి రుణాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేయటం తదితర విషయాలలో కీలక పాత్ర పోషించనున్నారు.

జిల్లాలోని సంఘాల వివరాలు	
జిల్లాలోని మహిళాసంఘాలు	18,756
ఆయా సంఘాలలో ఉన్న సభ్యులు	1,90,381
జిల్లాలో ఉన్న గ్రామైక్య సంఘాలు	695

గడువులోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి



మహిళా స్వయం సహాయక సంఘాలలో కొత్త అధ్యక్షులను నిబంధనల మేరకు ఎన్నుకుంటారు. నిర్దేశిత గడువులోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తాం. ఇప్పటికే మండల అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కల్పించాం.

–జ్యోతి, డీఆర్‌డీఓ



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ఇళ్ల స్థలాల కోసం నిరసన

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలతోపాటు రూ.5లక్షలు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ...మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులంతా నిరుపేదలని, వారికి సొంత ఇళ్లులేవన్నారు. అందుకని ప్రభుత్వం వారికి ఇళ్ల స్థలాలతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించిన వారికి ఇంతవరకు డబ్బులు ఇవ్వలేదన్నారు. ఎన్నికల డ్యూటీ డబ్బులు వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు యశోదమ్మ, మాణిక్, శ్రీనివాస్, పాండు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిద్దిపేట రూపురేఖలు మారిపోయాయి

- 50 ఏళ్ల తర్వాత మళ్లీ పురిటిగడ్డకు
- సంతోషంగా ఉంది: సీనియర్ సిటిజన్లు



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్లు

సిద్దిపేటజోన్: యాభై ఏళ్ల కిందట ఉన్న సిద్దిపేటకు ప్రస్తుతం చూస్తున్న దానికి చాలా వ్యత్యాసం ఉందని, అభివృద్ధి చెంది రూపు రేఖలే మారిపోయాయని సిద్దిపేట సీనియర్ సిటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ మిత్రులుగా చాలా సంతోషంగా ఉందన్నారు. సిద్దిపేట పట్టణంలో బాల్యం, విద్యాభ్యాసం పూర్తి చేసుకొని విదేశాల్లో ఏళ్ల కొద్ది జీవించిన తర్వాత సిద్దిపేట రావడం జరిగిందన్నారు. సిద్దిపేట పట్టణం అభివృద్ధి చెందడంతో రోల్ మోడల్గా ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రత్యేక శ్రద్ధతో సిద్దిపేట ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ఈ సందర్భంగా వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం రంగనాయక, మల్లన్న సాగర్, కోమటిచెర్వు సందర్శించారు. సమావేశంలో సికిందర్, హమీద్, నజీమ్, కలిమ్‌తో పలువురు పాల్గొన్నారు.

పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి



ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న డీఎస్పీ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రంగాయపల్లి శివారులో గల ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమ బట్టిలోంచి వచ్చే వేస్టేజ్‌ను ఒక పక్కన వేయగా వేడికి అక్కడ మంటలు చెలరేగి పక్కన్న ఉన్న స్టోర్ రూమ్ దగ్ధమైంది. ఇది గమనించిన యాజమాన్యం, స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలార్పారు. కార్మికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పరిశ్రమ వద్దకు చేరుకొని కార్మికులతో మాట్లాడారు. వీరి వెంట తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్ ఉన్నారు. పరిశ్రమలో జరిగే ప్రమాదాల వల్ల గ్రామానికి ముప్పు పొంచి ఉందని రంగాయపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళ్లలో కారం కొట్టి

- మహిళ మెడలోంచి బంగారం చోరీ

పటాన్‌చెరు టౌన్: కిరాణా షాపు నిర్వాహకురాలు కళ్లలో కారం కొట్టి గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోంచి బంగారం లాక్కెళ్లిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తులసీవనం కాలనీలో రమ్య అనే మహిళ కిరాణా షాపు నడుపుతుంది. మూడు రోజుల నుంచి ఓ వ్యక్తి కిరాణా షాపునకు తెల్లవారుజామున వచ్చి సామగ్రి తీసుకెళ్తున్నాడు. బుధవారం ఉదయం బైక్‌పై మాస్క్ ధరించి కిరాణా షాపునకి వచ్చాడు. ఉల్లిపాయలు కావాలని అడుగడంతో రమ్య తీస్తుండగా ఆమె కళ్లల్లో కారం కొట్టి మెడలో నుంచి పుస్తెలతాడు లాగే ప్రయత్నం చేశాడు. ఆమె గట్టిగా పట్టుకోవడంతో విరిగిన అరతులం బంగారంను లాక్కొని పారిపోయాడు. ఈ ఘటనపై షాపు నిర్వాహకురాలు రమ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు కోహెడ గ్రామానికి చెందిన మంద శంకర్. ఐదెకరాల్లో పత్తి సాగు చేసి అందులోనే కంది పంట వేశాడు. 10 క్వింటాళ్ల వరకు కందులు దిగుబడి రావడంతో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌కి అమ్మకానికి తీసుకెళ్లాడు. అధికారులు ఆన్‌లైన్‌లో పంట వివరాలు నమోదు కాలేదని కందులు కొనలేమని చెప్పారు. ఏం చేయాలో పాలుపోని శంకర్ మార్కెట్‌లో పోసిన కందులను బయట వ్యాపారికి క్వింటాల్‌కు రూ.6,000 చొప్పున నష్టానికి అమ్ముకొని వెళ్లాడు.



గాంధీనగర్‌లో తెగులు సోకిన వరి పంట

అధికారుల నిర్లక్ష్యమే రైతులను ముంచేను

క్షేత్ర స్థాయిలో పంటలు పరిశీలించని వ్యవసాయ అధికారులు

- సాగుపై రైతులకు కొరవడిన అవగాహన
- సబ్సిడీ విత్తనాలపై అందని సమాచారం
- బయట మార్కెట్‌లో కొనుగోలు
- తెగుళ్ల సమయంలో ఏం మందులు వాడాలో తెలియని పరిస్థితి
- ఆన్‌లైన్‌లో నమోదుకాని పంట వివరాలు
- సీసీఐలో అమ్ముకోలేక దళారులకు విక్రయం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. రైతులు సాగు చేసిన పంటలను అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించడం లేదు. దీంతో పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు. అలాగే విత్తన ఎంపిక, ఎరువుల వాడకం, తెగుళ్ల నివారణ సమయంలో ఎలాంటి మందులు వాడాలనేది తెలియడం లేదు.

హుస్నాబాద్ డివిజన్ అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్, బెజ్జంకి మండలాల్లో 68,272 ఎకరాల్లో పంటలు సాగు చేయగ అందులో వరి 53,280, మొక్కజొన్న 12,782, పొద్దుతిరుగుడు 1660, వేరుశనగ 150, ఇతర పంటలు 400 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. యాసంగి సీజన్‌కు ముందు గ్రామాల్లో అవగాహన కల్పించలేక రైతులు వారికి నచ్చిన పంటలను సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతం సాగు నీరు కష్టాలను తప్పించుకొనేందుకు కూడా రైతులు వరి తగ్గించి మొక్కజొన్న పంటను పెంచారు. ప్రైవేటు సీడ్ విత్తన కంపెనీలు గ్రామాలకు రావడంతో వారి దగ్గర విత్తనం తీసుకొని పంట సాగు చేస్తున్నారు. పంటల దిగుబడులు విత్తన కంపెనీలు గ్యారంటీ ఇవ్వకపోవడం, కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు చేతుకు రాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎక్కువ దిగుబడులు వస్తాయనే ఆశ రైతులను విత్తన కంపెనీల వైపు చూస్తున్నారు. గాంధీనగర్, తోటపల్లి, చౌటపల్లి గ్రామాల్లో మొక్కజొన్న పంటలను సాగు చేసిన రైతులు విత్తనం మొలువకపోవడంతో విత్తనం చెడగొట్టి లోకల్ విత్తనం వేసుకొన్నారు. దీంతో రైతలకు పెట్టుబడుల భారం పెరిగింది, సమయం వృథా అయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సబ్సిడీ విత్తన వెనక్కి..

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నేషనల్ సీడ్ కార్పొరేషన్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల రైతుల కోసం 18 క్వింటాళ్ల హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనం సరఫరా చేసింది. 10 కిలోల విత్తనం ఖరీదు రూ.275 ఉంటే రూ.100 సబ్సిడీ పోను రైతులు రూ.175 చెల్లించాలి. రైతులకు అధికారులు అదును దాటిన తర్వాత సమాచారం ఇవ్వడంతో అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో ఒక రైతు కూడా విత్తనం తీసుకోలేదు. కోహెడ, బెజ్జంకి మండలాల్లో 8 క్వింటాళ్ల విత్తనాలను రైతులు తీసుకొని సాగు చేశారు. ప్రభుత్వం విత్తనం సరఫరా చేస్తుందని రైతులకు అధికారులు చెప్పకపోవడంతో రైతులు ప్రైవేటు కంపెనీల విత్తనాలను కొనుగోలు చేసి పంటలు సాగు చేశారు.

వేధిస్తున్న ఆన్‌లైన్ సమస్య..

వ్యవసాయ అధికారులు క్లస్టర్ పరిధిలోని గ్రామాలకు వెళ్లి రైతులకు విత్తన ఎంపిక, ఎరువుల వాడకం, తెగుల్ల నివారణ పై అవగహన కల్పిస్తే మంచి దిగుబడులు తీస్తారు. క్షేత్ర స్థాయికి వెళ్లిన అధికారులకు రైతులు ఏ పంటలు వేశారనే విషయాలు కూడా తెలుసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం సులభమవుతుంది. పంటల క్షేత్రాలకు వెళ్లని అధికారులు ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు లేక పంటలు విక్రయించడానికి మార్కెట్‌కు వెళ్లే ఆన్‌లైన్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాలకు వచ్చి పంటలను ఆన్‌లైన్ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రెండు ఎకరాలను చెడగొట్టిన



హైబ్రిడ్ సీడ్ మక్క అంటే ఉత్తర కార్తెల దుక్కిపోతం చేసి విత్తనం పెట్టిన. విత్తనాలు సరిగాలేక మక్క మొలువలేదు. రెండు ఎకరాల మక్క చేను దున్ని మళ్లీ దుకాణానికి వెళ్లి లోకల్ మక్క తెచ్చి పెట్టిన. రూ.15 వేలు ట్రాక్టర్ దున్నకానికి అయ్యింది. మక్కలు పెట్టి పెట్టుబడి ఖర్చు నష్టపోయిన. మా భూమి దగ్గరనే ఏడీఏ ఆఫీసు ఉంటదని, అయినా ప్రభుత్వం సబ్సిడీ విత్తనం వచ్చిందని చెప్పలేదు.

– పోలు మహేందర్, రైతు గాంధీనగర్

పంటల వద్దకు వెళ్లాలని ఆదేశించాం



డివిజన్ పరిధిలోని వ్యవసాయ క్లస్టర్ల వారీగా ఏఈఓలను పంటల క్షేత్రాలకు వెళ్లాలని ఆదేశించాం. పంటల తెగుళ్ల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పాం. ఆన్‌లైన్ నమోదు కూడా చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ నాసిరకం ఉందని రైతులు వద్దంటే తిరిగి పంపించాం. కోహెడ, బెజ్జంకి రైతులు మొక్కజొన్న సాగు చేసుకున్నారు.

– శ్రీనివాస్, ఏడీఏ, హుస్నాబాద్

స్రవంతి.. ప్రాజెక్టుతో సత్తా చాటి

- అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపికైన 'డెస్క్ లిఫ్టర్'
- తక్కువ ఖర్చు, తేలికైన వస్తువులతో రూపకల్పన చేసిన విద్యార్థిని
- సులువుగా గదులు శుభ్రం చేసేందుకు ఉపయోగం



'డెస్క్ లిఫ్టర్' ప్రాజెక్టుతో విద్యార్థిని స్రవంతి

జోగిపేట(అందోల్): ప్రతి రోజూ కళ్ల ముందే అంగవైకల్యంతో ఉన్న స్వీపర్ తరగతి గదిని శుభ్రం చేస్తూ పడుతున్న ఇబ్బందులు చూసి ఆ విద్యార్థినిని తన ఆలోచనకు పదును పెట్టింది. ఈ ఇబ్బందిని ఎలాగైన దూరం చేయాలని సులభంగా గదిని శుభ్రం చేసే విధంగా ఓ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. రెండు, మూడు మాసాలు కష్టపడి 'డెస్క్ లిఫ్టర్' అనే ప్రాజెక్టును తయారు చేయడమే కాకుండా అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది.

సంగారెడ్డి జిల్లా అందోలు మండలం కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన అతిపేద కుటుంబానికి చెందిన ఆశం యాదయ్య, కవితల మూడవ కూతురు స్రవంతి. జోగిపేటలోని ఎస్ఆర్ఎమ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. పాఠశాలలో పని చేస్తున్న సైన్స్ టీచర్ సిద్దేశ్వర్ సహకారంతో 2023లో 'డెస్క్ లిఫ్టర్' అనే ప్రాజెక్టుకు తయారు చేసింది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఈ ప్రాజెక్టు ప్రదర్శించారు. అక్కడ అందరినీ ఆకట్టుకొని హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర ప్రదర్శనకు ఎంపికైంది. 2024వ సంవత్సరం సెప్టెంబర్ మాసంలో ఢిల్లీలో జరిగిన 11వ నేషనల్ సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డు ప్రదర్శనలో ప్రాజెక్టుకు ప్రశంసలు దక్కాయి. అంతే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో 2025 జూన్‌లో జపాన్‌లో నిర్వహించే అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపిక చేశారు. జపాన్ ప్రదర్శనకు జాతీయ స్థాయిలో 60 ప్రాజెక్టులు, రాష్ట్ర స్థాయిలో నాలుగు ప్రాజెక్టులు ఎంపిక కాగా వాటిలో కన్‌సాన్‌పల్లి విద్యార్థిని రూపొందించిన 'డెస్క్ లిఫ్టర్' ప్రాజెక్టు ఒకటి కావడం విశేషం. అతి తక్కువ ఖర్చుతో, తేలికైన వస్తువులతో ఎక్కడికైనా అవలీలగా తీసుకువెళ్లే విధంగా 'డెస్క్ లిఫ్టర్' ప్రాజెక్టును రూపొందించారు. పాఠశాలలు, ఆఫీసులు, ఇతర కార్యాలయాల్లో గదులు శుభ్రం చేయడానికి దీన్ని వాడొచ్చు.

సంతోషంగా ఉంది



డెస్క్ లిఫ్టర్ ప్రాజెక్టు తయారు చేసే సమయంలో జిల్లా, రాష్ట్ర స్థాయి గుర్తింపు వస్తే చాలనిపించేది. కానీ భారత ప్రభుత్వం ద్వారా జపాన్‌లో జరిగే ప్రదర్శనకు ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉంది. జూన్‌లో జపాన్ వెళ్లేందుకుగాను అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాను. పాస్‌పోర్టును కూడా సిద్ధం చేసుకున్నాను. ఈ అనుభూతిని జీవితంలో మరచిపోను.

– స్రవంతి, విద్యార్థి, కన్‌సాన్‌పల్లి

జాతీయ స్థాయిలో గుర్తింపు



డెస్క్ లిఫ్టర్ అనే పరికరాన్ని ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. ఈ ప్రాజెక్టు ద్వారా స్కూళ్లు, ఆఫీసులు, ఆస్పత్రుల్లో టేబుళ్లని లేపి చక్కగా శుభ్రం చేయొచ్చు. 2025 జూన్ మాసంలో జపాన్ రాష్ట్రంలోని సకూరలో జరిగే ప్రదర్శనకు భారతదేశ ప్రభుత్వం ఎంపిక చేసింది. గతేడాది కన్‌సాన్‌పల్లి పాఠశాల నుంచి 'పింక్ లూ ' ప్రాజెక్టు తరపున భూమిక జపాన్ ప్రదర్శనకు వెళ్లింది.

– సిద్దేశ్వర్, గైడ్ టీచర్, కన్‌సాన్‌పల్లి

జిజ్ఞాస ప్రాజెక్ట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నర్సాపూర్ రూరల్: విజ్ఞాన ప్రాజెక్టు పోటీల్లో నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ బుధవారం తెలిపారు. ఇటీవల కళాశాల విద్యా కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో నర్సాపూర్ ప్రభుత్వ కళాశాల నుంచి జంతు శాస్త్రం, చరిత్ర, ఆంగ్ల సబ్జెక్టులు ఆకట్టుకున్నాయి. ఒక్కో ప్రాజెక్టుకు ఐదుగురు చొప్పున విద్యార్థులు పాల్గొన్నారు. జంతు శాస్త్రానికి సంబంధించి నర్సాపూర్ అటవీ ప్రాంతంలోని అర్బన్ పార్క్ నందు సీతాకోకచిలుకల వైవిధ్యం, నర్సాపూర్ ప్రాంతీయ గిరిజన మహిళల సాంస్కతిక మార్పుపై చరిత్ర, ఆంగ్లంకు సంబంధించి ఆంగ్ల భాష నేర్చుకోవడంలో విద్యార్థులు ఆందోళన గురించి అధ్యయనం వంటి ప్రాజెక్టులు తయారు చేశారు. ఈ ప్రాజెక్టుల ప్రదర్శనకు, సలహాలు సూచనలు ఇచ్చిన అధ్యాపకులను, విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు తోటి అధ్యాపకులు అభినందించారు.

సమస్యల పరిష్కారంపై సీఎం హామీ

- ఉద్యోగులతో మార్చిలో ప్రత్యేక సమావేశం
- టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై మార్చి మొదటి వారంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పరిష్కార చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం సీఎంని హైదరాబాద్‌లో కలిసి కరీంనగర్ వెళ్తూ మార్గమధ్యలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డికి వివరించి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని, పెన్షన్ బెనిఫిట్స్ రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన సీఎం సీనియార్టీ ప్రకారం చెల్లింపు జరిగేలా చూస్తామని, ఏప్రిల్‌లో డీఏలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఉద్యోగుల అన్ని సమస్యలపై మార్చి మొదటి వారంలో ప్రత్యేకంగా సమీక్ష చేస్తానని సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నారని సీఎంకు వివరించినట్లు తెలిపారు. ఎల్బీ స్టేడియంలో భారీ స్థాయిలో త్వరలో ఉద్యోగుల సమావేశం ఉంటుందని, టీఎన్జీవో ప్రతినిధులు రావాలని సూచించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం

కాలకృత్యాలకు వెళ్లి వ్యక్తి..



పెంటయ్య

సంగారెడ్డి క్రైమ్: కాలకృత్యాల కోసం బస్సు దిగిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన సంగారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం ఉత్తులూరు గ్రామానికి చెందిన వడ్డీ పెంటయ్య, భార్య రాములమ్మతో 18న హైదరాబాద్‌లోని ఎల్లమ్మ బండ వద్ద ఉండే కుమారుడిని చూడడానికి బయలు దేరారు. మతిస్థిమితం సరిగా లేని పెంటయ్య సంగారెడ్డి కొత్త బస్టాండ్‌లో భార్యతో చెప్పి కాలకృత్యాల కోసం దిగాడు. బస్సు బయలు దేరే సమయానికి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో వెంటనే రాములమ్మ కుమారుడికి ఫోన్ చేసి విషయం చెప్పింది. మహేశ్ వచ్చి తండ్రి కోసం ఆరా తీసిన ఫలితం దక్కలేదు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన పెద్ద లక్ష్మయ్య మేస్త్రీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. 14న పనికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా లక్ష్మయ్య కనిపించలేదు. తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. చిన్నాన్న కనబడడం లేదని కోటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దళితుల భూముల జోలికి రావొద్దు

- సర్వేను అడ్డుకున్న దళితులు
- మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డిని నిలదీత
- చిన్నగొట్టిముక్కులలో ఘటన



రవీందర్‌రెడ్డితో వాగ్వాదం చేస్తున్న దళితులు

శివ్వంపేట(నర్సాపూర్): దళితుల భూములు ఆక్రమించాలని చూస్తున్నారంటూ దళితులు మాజీ ఎమ్మెల్యే ఏనుగుల రవీందర్‌రెడ్డి నిర్వహిస్తున్న సర్వేను అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. ఈ ఘటన మండలంలోని చిన్న గొట్టిముక్కులలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సర్వే నంబర్ 296లో 80 ఎకరాల్లో 60 దళిత కుటుంబాలకు గతంలో ఇందిరమ్మ ఇచ్చిన సాగు భూములు ఉన్నాయి. వీటి పక్కనే ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగుల రవీందర్‌రెడ్డి పట్టా భూములను కొనుగోలు చేసి సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు ఏడీ సర్వేయర్ శ్రీనివాస్, అధికారులు సర్వేకు వచ్చారు. విషయం తెలియడంతో దళితులు చంద్రయ్య, లింగం, రాములు, అశోక్, సైదులు, నర్సింలు, భిక్షపతి, కుమార్ తదితరులు తాము ఎంతో కాలంగా సాగు చేస్తున్న భూముల్లో సర్వే చేయొద్దని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యేను నిలదీశారు. తమ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని గొడవకు దిగారు. దళితుల భూముల్లో ఉపాధి హామీ ద్వారా మట్టి రోడ్డు వేశారని దారిని సైతం కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అధికారులు సైతం మాజీ ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతున్నారని ఈవిషయం సీఎం దృష్టికి తీసుకెళ్తామని దళితులు చెప్పారు. తాను కొనుగోలు చేసిన భూమిని మాత్రమే సర్వే చేయిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే వివరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చచెప్పారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- కల్లు తాగేందుకు వచ్చి ఈతకు వెళ్లిన యువకులు
- ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి
- జిన్నారం మండలంలోని వావిలాల పీర్ల చెరువు వద్ద ఘటన




నరేశ్, శంకర్ మృతదేహాలు

జిన్నారం (పటాన్‌చెరు): చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగలక్ష్మి కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లా గాగిల్లాపూర్‌కు చెందిన వల్లపు రాంబాబు కుమారుడు నరేశ్(26), వల్లపోలు రాజు కుమారుడు శంకర్ (22) ఇద్దరూ స్నేహితులు కాగా కూలీ పని చేస్తుంటారు. మంగళవారం సాయంత్రం జిన్నారం మండలం వావిలాలలో కల్లు తాగేందుకు స్కూటీ పై వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో ఈత కొట్టేందుకు వావిలాల పీర్ల చెరువులోకి దిగారు. చెరువు ఎక్కువ లోతు ఉండడంతో ప్రమాదవశాత్తు మునిగిపోయారు. అక్కడే గేదెలు మేపే ఓ వ్యక్తి గమనించి చెరువులో దిగి కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. వెంటనే పోలీసులకు విషయం చెప్పాడు. బుధవారం జగంపేట వావిలాల గ్రామాలకు చెందిన ఈతగాళ్ల సాయంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మధ్యాహ్నం మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ మేరకు జిన్నారం పోలీసులు కేసు నమోదు చేశారు.

శుభకార్యానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి

బైకును ఢీకొట్టిన టిప్పర్: యువకుడు దుర్మరణం



ప్రకాశ్ (ఫైల్)

కొండాపూర్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. కొండాపూర్ ఎస్ఐ హరీశ్ కథనం మేరకు.. మారేపల్లి గ్రామానికి చెందిన గంజాయి ప్రకాశ్ (28) బంధువుల శుభకార్యం నిమిత్తం మూడు రోజుల కిందట మండల పరిధిలోని మల్కాపూర్‌కు వచ్చాడు. బుధవారం ఉదయం కార్యక్రమం కోసం కొన్ని వస్తువులను కొనుగోలు చేసేందుకు బైక్‌పై బంధువైన జేమ్స్‌తో కలిసి సంగారెడ్డికి వచ్చాడు. తిరిగివెళ్తున్న క్రమంలో మల్కాపూర్ గ్రామ శివారు వద్దకు చేరుకోగానే వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రకాశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు గంజాయి ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

న్యాల్‌కల్(జహీరాబాద్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని హుస్సెల్లి చెక్ పోస్టు వద్ద చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని శంశల్లాపూర్ గ్రామానికి చెందిన ప్రభు(31) మంగళవారం రాత్రి హుస్సెల్లి చౌరస్తా నుంచి కాలి నడకన ఇంటికొస్తున్నాడు. చెక్ పోస్టు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పున్నెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శివాజీ జయంతి ఉత్సవాల్లో అపశృతి

- జెండావిష్కరణ చేస్తుండగా ఏడుగురికి విద్యుత్ షాక్
- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- వర్గల్ మండలం జబ్బాపూర్‌లో విషాదం



మృతదేహం వద్ద విలపిస్తున్న ప్రశాంత్ తల్లి



ప్రశాంత్(ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. వర్గల్ మండలం జబ్బాపూర్‌లో జెండావిష్కరణ చేస్తుండగా విద్యుత్ తీగలు ఇనుప జెండా పైపునకు తగిలి ఏడుగురికి కరెంట్ షాక్ కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా జబ్బాపూర్ గ్రామ కూడలిలో యువకులు, గ్రామస్తులు ఇనుప పైపుతో కూడిన కాషాయజెండాను ఎగుర వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉదయం 11.30 ప్రాంతంలో జెండాను పైపు చివరన బిగించారు. లింగ ప్రశాంత్(22), దేశెట్టి కరుణాకర్(22), పల్లపు బన్నీ, కొంతం వేణు, కొంతం కనకరాజు, లింగ గణేష్, లింగ మహేశ్ జెండా పైపును పట్టుకొని పైకి లేపుతుండగా ప్రమాదవశాత్తు పైనున్న కరెంట్ తీగలకు తగిలింది. దీంతో పైపును పట్టుకున్న వారందరూ విద్యుత్ షాక్‌కు గురై పడిపోయారు. షాక్ తీవ్రతకు లింగ ప్రశాంత్ మృతి చెందగా, దేశెట్టి కరుణాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితులను గ్రామస్తులు చికిత్స నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కరుణాకర్‌ను మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనతో జబ్బాపూర్ గ్రామం శోకసంద్రమైంది. చేతి కందిన కొడుకు విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడటంతో ప్రశాంత్ తల్లి కనకమ్మ రోదనలు మిన్నంటాయి. ఒంటరిని చేసి పోయావా అంటూ ఆమె విలపిస్తుంటే ఆపడం ఎవరి తరం కాలేదు. డిగ్రీ చదువులో మిన్నగా, ఎన్‌సీసీలో గ్రూప్ లీడర్‌గా ప్రశాంత్ రాణించాడు. మిన్నంటిన రోదనల మధ్య అతడి అంత్యక్రియలు ముగిశాయి.